
ప్రజాశక్తి

మంగళవారం 2 ఏప్రిల్ 2024

5

పార్వతీపురం మన్యం



జనసేనలోకి జయకృష్ణ

ప్రజాశక్తి - పాలకొండ

టిడిపి నియోజకవర్గ ఇన్-ఛార్జ్ నిమ్మక జయకృష్ణ సోమవారం పిఠాపురంలో జనసేన ఖండువా కప్పుకున్నారు. కూటమి పొత్తులో భాగంగా పాలకొండ నియోజకవర్గం జనసేనకు సీటు కేటాయించడంతో తెలుగుదేశం నుంచి టికెట్ ఆశిస్తున్న జయకృష్ణకు జనసేన తరుపున టికెట్ ఇస్తున్నట్లు సమాచారం. టిడిపిలో నాలుగున్నర ఏళ్లగా ఇన్-ఛార్జ్‌గా పనిచేస్తూ పార్టీని ముందుకు తీసుకెళ్లిన జయకృష్ణకు అవకాశం ఇవ్వాలని అంతా భావించారు. అనుకున్నట్లే జయకృష్ణకు జనసేన తరుపున టికెట్ కేటాయించనున్నట్లు తెలిసింది. ఆ పార్టీ నాయకులు కూడా జనసేన టికెట్ జయకృష్ణకు ఇవ్వాలని పవన్ కల్యాణ్‌కు కోరినట్టు తెలిసింది.



అభివృద్ధికి దూరంగా గిరిజన గ్రామం

ఇంకా వెనుకబాటే

- వెంటాడుతున్న దీర్ఘకాలిక సమస్యలు
- పరిష్కారం చూపని ప్రభుత్వాలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

కురుపాం నియోజకవర్గంలో దీర్ఘ కాలిక సమస్యలు ప్రజలను వెంటాడుతున్నాయి. ఏళ్ల తరబడి సమస్యలున్నా ప్రభుత్వాలు, పాలకులు పట్టించుకోకపోవడంతో ప్రజలను నిత్యం వేధిస్తున్నాయి. నియోజకవర్గంలో గుమ్మలక్ష్మీపురం, కురుపాం, జియమ్మవలస, కొమరాడ, గరుగుబిల్లి మండలాలు ఉన్నాయి. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాలైన గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల్లో ఎక్కువ శాతం మంది గిరిజనులు జీవనం సాగిస్తున్నారు. అయితే ఈ మండలాల్లో నేటికీ తాగునీరు, రోడ్లు, విద్య, వైద్యం వంటి మౌలిక వసతులు అభివృద్ధికి నోచుకోకపోవడంతో గిరిజనులు నేటికీ వెనుకబాటు జీవనం గడుపుతున్నారు.

పరిశ్రమలు లేవు.. ఉపాధి కరువు...

ఏజెన్సీ ప్రాంతంలో చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటు చేయాలని గత కొన్నేళ్ల నుంచి గిరిజనులు కోరుతున్నా చర్యలు చేపట్టడంలో ప్రభుత్వాలు శ్రద్ధ చూపడంలేదు. గతంలో ఏర్పాటు చేసిన చేపల పరిశ్రమ, పట్టు పరిశ్రమ, బనియన్ ఫ్యాక్టరీలు గిరిజన యువతకు ఎంతో ప్రయోజనకరంగా ఉండేవి. అయితే నిర్వహణా లోపంతో వీటిని మూసివేయడంతో గిరిజన యువతకు ఉపాధి కరువైంది. ఐటిడిఎ అధికారులు స్పందించి గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో చింతపండు, జీడి ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తే వందలాదిమంది గిరిజన నిరుద్యోగ యువతి , యువకులకు ఉపాధి దొరుకుతుంది.

కలగా మిగిలిన క్రీడా మైదానాలు

కురుపాం నియోజకవర్గంలో గుమ్మలక్ష్మీపురం, జియమ్మవలస మండలాల్లో క్రీడా మైదానాలు ఏర్పాటు కలగానే మిగిలిపోయాయి. 20 ఏళ్ల కిందట క్రీడా మైదానాల ఏర్పాటు కోసం అధికారులు ప్రతిపాదనలు తయారు చేసినా నేటికీ పనులు ప్రారంభం కాలేదు. గుమ్మ లక్ష్మీపురంలో రూ.రెండు కోట్లతో నిర్మిస్తున్న ఇండోర్ స్టేడియం పనులు కూడా మధ్యలోనే నిలిచిపోయాయి. దీంతో గిరిజన యువతకు క్రీడా శిక్షణ లేకుండా పోయింది.

వెంటాడుతున్న ఏనుగుల సమస్య

నియోజకవర్గంలో జిఎం వలస, కొమరాడ మండలాల్లో గత 17 ఏళ్లుగా అడవి ఏనుగుల సమస్య వెంటాడుతుంది. ఒడిశా రాష్ట్రం నుంచి ఈ ప్రాంతానికి వచ్చిన అడవి ఏనుగుల గుంపు రైతులు పండించే వరి, మొక్కజొన్న, చెరకు పంటలను నాశనం చేస్తూ తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయి. గ్రామాల్లోకి ఏనుగులు రావడంతో ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా పోతుంది. ఇప్పటివరకు ఏనుగుల దాడిలో ఎంతోమంది మృత్యువాత పడ్డారు.



చలమ నీటిని తీసుకు వస్తున్న గిరిజనులు (ఫైల్)

రోడ్డు లేదు... తాగునీరు రాదు...

వాడబాయి, ఓంద్రు బంగి, గోరటి, శిఖరపాయి, వామసి, వనకాబడి వంటి ఎత్తయిన కొండలపై గిరిజన గ్రామాలకు రోడ్డు మార్గం లేకపోవడం, బోర్లు నిర్మించకపోవడంతో చలములు, గెడ్డవాగులపై ఆధారపడి జీవనం గడుపుతున్నారు. కలుషిత నీటిని తాగుతున్న గిరిజనులు వ్యాధుల బారిన పడుతున్నారు. రోడ్డు మార్గం లేకపోవడంతో గర్భిణులు, చిన్నారులు, వృద్ధులను డోలీల సాయంతో వైద్యం కోసం తీసుకొస్తున్న సందర్భాలు నిత్యం కనిపిస్తున్నాయి. ఇక్కడ చిన్నారులకు విద్య అంతంత మాత్రమే. దీంతో డ్రాపౌట్స్ సంఖ్య నమోదవుతూనే ఉంటుంది. పక్కా గృహాల నిర్మాణాలు లేకపోవడంతో శిథిలమైన ఇళ్లలోనే తల దాచుకుంటూ జీవనం సాగిస్తున్నారు.



నిర్వహణ లోపంతో పడకేసిన మినీ రిజర్వాయర్

పడకేసిన సాగునీటి వనరులు

ఏజెన్సీ ప్రాంతంలో పంట పొలాలకు సాగునీరందించాలనే లక్ష్యంతో నిర్మించిన చెక్ డ్యాములు నిర్వహణా లోపంతో పడకేశాయి. గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల్లో సీమలగూడ, కొత్తగూడ, వంగర, కేసర, కేసరగూడ, దుమ్మంగి, జిశివడ, కాకిలి, చాపరాయి గూడ, వబ్బంగి తదితర ప్రాంతాల్లో మైనర్ ఇరిగేషన్, పిటిజి, ఉపాధిహామీ నిధులతో చెక్ డ్యాముల నిర్మాణాలను చేపట్టారు. అయితే నిర్వహణ లోపం కారణంగా అవి శిథిలమయ్యాయి. దీంతో ప్రతి ఏటా గిరిజన రైతులు వర్షాధారంపైనే ఆధారపడి పంటలు పండిస్తున్నారు. లేదంటే ఆ ఏడాది కరువు తప్పదు.

చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటు చేయాలి

గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసి గిరిజనులకు ఉపాధి కల్పించాలి. జీడి పరిశ్రమ ఏర్పాటు, దుమ్మంగిలో చేపల ఉత్పత్తి కేంద్రం వినియోగంలోకి తీసుకొచ్చి గిరిజనులకు ఉపాధి కల్పించాలి. ముఖ్యంగా గిరిజన నిరుద్యోగ యువతను దృష్టిలో ఉంచుకుని వైటిసిలో శిక్షణ ఇచ్చి స్థానికంగా ఉపాధి అవకాశాలు కల్పించాలి.

పాలక క్రాంతి కుమార్
సర్పంచి దుమ్మంగి

వెనుకబాటు జీవితం...

కొండ శిఖర గ్రామాలకు రహదారి సౌకర్యం లేకపోవడంతో నేటికీ గిరిజనులు వెనుకబాటు జీవనం గడుపుతున్నారు. విద్య, వైద్యం, తాగునీరు వంటి మౌలిక వసతులు మెరుగుపడలేదు. అధికా రులు స్పందించి రహదారి నిర్మాణా లకు ప్రాధాన్యత ఇవ్వాలి. మౌలిక వసతులు అందుబాటులోకి తేవాలి.

మండంగి రమణ,
ఆదివాసీ గిరిజన సంఘం
జిల్లా, కోశాధికారి

గిరిజనుల పట్ల చిన్నచూపు

ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా గిరిజనుల పట్ల చిన్నచూపు కొనసాగుతూనే ఉంది. గిరిజనాభివృద్ధి, సంక్షేమం కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నామని ప్రభుత్వాలు ప్రకటనలు చేస్తున్నా ఆచరణలో ఎక్కడా కానరావడం లేదు. దీంతో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే చందంగా మారింది.

కోలక అవినాష్,
ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

ప్రజాస్వామ్యం, మత సామరస్యాన్ని దెబ్బతీస్తున్న

బిజెపిని ఓడించండి

దానికి మద్దతిస్తున్న పార్టీలకు బుద్ధి చెప్పండి : సిపిఎం

ప్రజాశక్తి - బలిజిపేట

దేశంలో లౌకిక ప్రజాస్వామ్యాన్ని, మతసామరస్య ఐక్యతను దెబ్బతీస్తున్న బిజెపిని ఓడించాలని, ఆ పార్టీకి మద్దతు పలుకుతున్న వైసిపి, టిడిపి, జనసేనకు బుద్ధి చెప్పాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు పిలుపునిచ్చారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో సిపిఎం నాయకులు బొద్దాన భానుమూర్తి అధ్యక్షతన సోమవారం సిపిఎం పార్టీ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వేణు మాట్లాడుతూ బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో మతఘర్షణలు, ప్రాంతీయ వైషమ్యాలు విపరీతంగా పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. దేశం ఫెడరలిజాన్ని, లౌకిక రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తూ దాని మత అజెండాను ముందుకు తెచ్చి దేశ ఐక్యతను నాశనం చేస్తుందని విమర్శించారు. కార్పొరేట్లకు లక్షల కోట్లు మాఫీ చేస్తూ, ప్రశ్నించిన వారిపై ఇడి, సిబిఐ స్వతంత్ర సంస్థలను తన జేబు సంస్థలుగా మలుచుకొని దాడి చేస్తుందన్నారు. తద్వారా ఎలక్ట్రికల్ బాండ్ల ద్వారా వేలకోట్ల రూపాయలు అవినీతికి పాల్పడిందని, అవినీతిపరులను వెనకేసుకొస్తూ దేశాన్ని లూటీ చేస్తుందని తెలిపారు. నిరుద్యోగ సమస్యను, నిత్యవసర వస్తువు ధరలు, పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గలేదడంలేదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలైన స్టీల్‌ప్లాంట్లు, ఎల్ఐసి, బిఎస్ఎన్ఎల్, ఎయిర్ ఫోర్స్, రైల్వే అన్ని రంగాలను కార్పొరేట్లకు, పెట్టుబడిదారులకు ధారాదత్తం చేస్తోందని విమర్శించారు. రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ రాజ్యాంగపరమైన హక్కుల్లేకుండా చేస్తుందని, ఇటువంటి బిజెపికి రాబోయే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. అలాగే మన రాష్ట్రంలో బిజెపికి వంత పాడుతున్న టిడిపి, జనసేన, వైసిపికి బుద్ధి చెప్పాలన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హెూదా, విభజన చట్టం హామీలు, రైల్వే జోను, విశ్వవిద్యాలయాలు, మెడికల్ కాలేజీలు, వెనకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ స్పెషల్ ప్యాకేజీ, రాజధాని నిధులు, పోలవరం నిధులు, ఏ ఒక్కటి కూడా అమలు చేయలేదని, అటువంటి బిజెపికి రెడ్ కార్పెట్ వేసి ఆంధ్ర రాష్ట్ర ప్రజలను వైసిపి, టిడిపి, జనసేన మోసగిస్తున్నాయని విమర్శించారు. అందుకనే దేశ ఐక్యత, లౌకిక తత్వాన్ని, మత సామరస్యాన్ని కాపాడుకోవాలని, కావున అరకు పార్లమెంట్లో ఇండియా కూటమి తరుపున పోటీ చేస్తున్న సిపిఎం అభ్యర్థిని బలపరచాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యులు యమ్మల మన్మధరావు, నాయకులు ఆవు సాంబమూర్తి, పీసా వెంకటస్వామి, బలరామ నాయుడు, నల్ల ఈశ్వరరావు, దన్నాన సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి

అదనపు పనిభారం ఆపాలి

- పోరాటంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలి
- ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి

ప్రజాశక్తి -బెలగాం

ఆశా, కమ్యూనిటీ హెల్త్‌వర్కర్లచే సంబంధం లేని అదనపు పనులను చేయించడం వెంటనే ఆపాలని, వారి పోరాటంలో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక గిరిజన సామాజిక భవనంలో జరిగిన జిల్లా సదస్సు సదస్సులో ఆమె మాట్లాడారు. జిల్లాలో కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు రూ.4వేలు మాత్రమే చెల్లిస్తున్నారని, ఆశాలతో సమానంగా పనిచేస్తున్న వీరికి తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశాలుగా మార్పు చేసి వారిలాగే వేతనం, ఇతర సౌకర్యాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజనులకు సేవలం దిస్తున్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. రోజూ సచివాలయాలు, హెల్త్ సెంటర్లకు, పిహెచ్‌సిలకు వర్కర్లు వెళ్లి అక్కడే డ్యూటీలు చేయడం వల్ల తీవ్ర ఆర్థిక భారం పడుతుందన్నారు. అలాగే ఎన్‌హెచ్ఎంకి భిన్నంగా ఆశా వర్కర్లతో పనిచేస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పోరాడి సాధించుకున్న హక్కులను, చట్టాలను తొలగించి కార్మికులకు, ఉద్యోగుకు, పేదలకు తీరని ద్రోహం చేస్తున్న బిజెపిని, దానికి మద్దతుగా ఉన్న పార్టీలను రాబోయే ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిచ్చారు. కార్మికులు, ప్రజల పక్షాన నిరంతరం పోరాడే వామపక్ష పార్టీలు, ఇండియా కూటమిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఆశాలు, సిహెచ్‌డబ్ల్యులచే అదనపు పనులు చేయించకూడదని ప్రభుత్వం నుంచి సర్కులర్ వచ్చినప్పటికీ జిల్లాలో అమలు చేయకుండా తమ ఇష్టానుసారంగా అధికారులు గొడ్డుచాకిరీ చేయించడం సరైందని కాదన్నారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా కమిటీతో జాయింట్ మీటింగు వేయాలని డిఎంఅండ్ హెచ్‌ఒను కోరారు. అలాగే నూతన కమిటీని ఆయనకు పరిచయం చేశారు. యూనియన్ నాయకులు ఎం.శివాని, కె.గౌరీశ్వరి అధ్యక్షతన జరిగిన సదస్సులో శ్రామిక మహిళా సంఘం నాయకులు వి.ఇందిర మాట్లాడుతూ ఆశా కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని ఫిబ్రవరి 8న చేపట్టిన ఆందోళనలో భాగంగా జరిపి చర్చల్లో ప్రభుత్వం ఆమోదించిన అంశాలపై వెంటనే జీఒలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వ్యాక్సిన్ క్యారియర్లను ఆశాలతో తెప్పించి ఆర్థిక భారం మోస్తున్నారని నెలలో పిహెచ్ఇఎల్ కి నాలుగైదు సార్లు రావాల్సి ఉంటుందని అన్నారు. ఏజెన్సీలోని ఆశా, సిహెచ్‌డబ్ల్యులను పెట్టి పెట్టి పిహెచ్ఎల్ కి వస్తున్నారని, ప్రభుత్వం ఈ బాధ్యతలకు పారితోషికం ఇవ్వాలని కోరారు. అనంతరం సమస్యలను డిఎంహెచ్ఒ డాక్టర్ జగన్నాథ రావుకు వినతిని ఇచ్చారు. దీనికి ఆయన స్పందించారన్నారు. కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ కు యూనిఫామ్ ఇవ్వాలని, గిరిజన ఆశా వర్కర్స్ వర్తించే సౌకర్యాలను కూడా కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ కి ఇచ్చేలా బాధ్యత వహించాలని కోరారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించకుంటే సిఐటియుగా పోరాటానికి సిద్ధమవుతామని, వెంటనే సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఉమ్మడి విజయనగరం జిల్లా ఆశా వర్కర్స్ యూనియన్ కార్యదర్శి బి.సుధారాణి మాట్లాడుతూ అనేక పోరాటాల ఫలితంగా వేతనాలను, యూనిఫామ్, ఇతర సౌకర్యాలను ఆశా వర్కర్లు పొందగలిగారని, మరిన్ని డిమాండ్ల పరిష్కారానికి రాబోయే కాలంలో రాష్ట్రవ్యాప్తంగా జరిగే పోరాటంలో ఆశా వర్కర్లంతా సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. అలాగే కమ్యూనిటీ హెల్త్ వర్కర్‌ను ఆశా వర్కర్లుగా మార్పు చేసే వరకు కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు, ఆశా వర్కర్లు ఐక్యంగా పోరాడాలని ఆమె పిలుపుని చ్చారు. సదస్సులో యూనియన్ నాయకులు మాలతి, అన్న పూర్ణ, పలువురు ఆశా, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

సదస్సు అనంతరం 26 మందితో ఆశా వర్కర్స్ యూనియన్ నూతన జిల్లా కమిటీ ఏర్పడింది. యూనియన్ జిల్లా నూతన అధ్యక్ష కార్యదర్శులుగా ఎం.శివాని, కె.గౌరీశ్వరి, కోశాధికారిగా కె.బృందావతితో పాటు 15 మంది ఆఫీస్ బేరర్స్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

పన్నుల వసూళ్లలో ముందంజ

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక నగర పంచాయతీ ఆస్తి పన్ను వసూళ్లను రాష్ట్ర స్థాయిలో మూడో స్థానం సాధించింది. మార్చి నెలాఖరు వరకు ఆస్తి పన్నుల వసూళ్లకు రాయితీ ఇవ్వగా, సిబ్బందికి కూడా వసూళ్లకు తీవ్రంగా కృషి చేసింది. మూడో స్థానంలో నిలిచినందుకు స్థానిక నగరపంచాయతీ కమిషనర్ ఎస్.సర్వేశ్వర్రావు మేనేజర్ పి.జయరాంకు, అడ్మిన్ కార్యదర్శికి మెమొంటోతో సత్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పన్నుల వసూళ్లలో అడ్మిన్ కార్యదర్శుల పాత్ర కీలకంగా ఉందని అభినందించారు.



సార్వత్రిక ఎన్నికలు వచ్చేశాయి. మరో నెలరోజుల్లో పోలింగ్ కూడా జరగనుంది. ఈనేపథ్యంలో అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఎమ్మెల్యే, ఎంపీ, అభ్యర్థులు, నాయకులు ప్రజలను ఓట్లను అభ్యర్థించేందుకు పోటీపడుతున్నారు. ఇటువంటి పోటీ ప్రజాసేవలోనూ, జిల్లా, నియోజకవర్గ అభివృద్ధిలోనూ కనిపించడం లేదు. ముఖ్యంగా ఉమ్మడి విజయనగరం జిల్లాలో అభివృద్ధికి పట్టుకొమ్మ వంటి వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయలేదు. కొత్త పరిశ్రమలు తీసుకురాలేదు సరికాదా, ఉన్న కొద్దిపాటి పరిశ్రమల మూసివేతకు కారణమయ్యారు. ఇటువంటి పరిస్థితుల్లో మెజార్టీ ప్రజానీకం పొట్టకూటికోసం పుట్టెడు అవస్థలు పడాల్సిన దుస్థితి దాపురించింది. వీటన్నింటినీ పక్కనబెట్టిన వైసిపి, టిడిపి నాయకులు, అభ్యర్థులు గతంలో ఇచ్చిన హామీలనే తిరిగి వల్లెవేస్తూ ఓటర్లను మభ్యపెడుతున్నారు.

పరిశ్రమల మూతతో ఉపాధికి గండి

- వ్యవసాయంలోనూ వెనుకబాటు
- వైసిపి, టిడిపి విధానాలే కారణం
- ఎన్నికలవేళ మరోసారి మోసగించేందుకు యత్నం


ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

విజయనగరం ఉమ్మడి జిల్లాలో ప్రత్యక్షంగా, పరోక్షంగా 80శాతం ప్రజానీకం వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవస్తున్నారు. పాలకుల విధానాల వల్ల వ్యవసాయ విస్తీర్ణం ఏటా తగ్గిపోతోంది. మరోవైపు ఉన్న కొద్దిపాటి పరిశ్రమలు మూతపడుతునే ఉన్నాయి. ప్రభుత్వాలు మారుతున్నా అధినేతల పల్లకీలు మోయడం తప్ప రాజకీయంగా జోక్యం చేసుకునే నాధులే జిల్లాలో లేకపోవడంతో ఈ రెండు రంగాల్లోనూ పరిస్థితులు నానాటికీ దిగజారుతున్నాయి. దీంతో, జిల్లాలో గ్రామీణ ముఖచిత్రాలు మారాయి. జిల్లా భౌగోళికంగా 16, 34, 750 ఎకరాల్లో విస్తరించి ఉంది. ఇందులో వ్యవసాయానికి అనువుగావున్న భూమి 9,25,387.5 ఎకరాల వరకు ఉంది. వ్యవసాయ, ఉద్యాన, వాణిజ్య పంటలు సాగుచేసేందుకు ఎంతో అనువుగా ఉంటుంది. జిల్లా వ్యాప్తంగా వరి, చెరకు, మొక్కజొన్న, పత్తి, మినుములు, పెసలు తదితర అపరాలు వంటి వ్యవసాయ పంటలు ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో కేవలం 3,41,130 ఎకరాల్లో మాత్రమే సాగయ్యాయి. ఇందులో అత్యల్పంగా ఉద్యాన పంటల సాగు కేవలం 1,67,902 ఎకరాల్లో మాత్రమే ఉంది. నాన్ ఫుడ్ క్రాప్ ఏరియా కూడా 23,096 (6శాతం) ఎకరాలుగా నమోదైంది. గతంలో పోలిస్తే క్రమంగా సాగు విస్తీర్ణం తగ్గుతోంది. సాగు విస్తీర్ణం కన్నా బీడువారుతున్న సాగుభూములు 2శాతం అధికంగా ఉండడం గమనార్హం. సుమారు 80శాతం జనాభా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఈ రంగాలపై ఆధారపడి జీవిస్తున్నారు. కానీ, సాగునీటి వసతి కల్పించక పోవడం, ఉద్యాన పంటలను తగినంతగా ప్రోత్సహించకపోవడం, ప్రభుత్వం తరపున బోర్లు, బావులు మంజూరు చేయకపోవడం, మైక్రో ఇరిగేషన్ పథకాలు పూర్తిగా స్తంభించడం వంటి కారణావల్ల సాగు భూమి తగ్గుతోంది. లక్షా 30వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు తలపెట్టిన తోటపల్లి ప్రాజెక్టు మిగులు పనులు పూర్తికాక పోవడం వల్ల సాగునీటి లక్ష్యం నీరుగారుతోంది. ఇప్పటికీ సుమారు 76వేల ఎకరాలకు మించి సాగునీరు అందడం లేదు. తారకరామ తీర్థసాగర్ పనులు చేపట్టి దాదాపు 17ఏళ్లు దాటుతున్నా అతీగతీ లేదు. జంఝావతి ప్రాజెక్టు తలపెట్టిన నాలుగు పదులు ఎప్పుడో దాటిపోయాయి. ఇక మైక్రో ఇరిగేషన్‌కు అనేది దాదాపు లక్ష్యం అనేదే లేకుండా పోయింది. దీనికితోడు వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులకు స్థానికంగా మార్కెట్ సదుపాయం కల్పించక పోవడం కూడా సాగుభూమి తగ్గుదలకు మరో కారణంగా చెప్పుకోవచ్చు. దీంతో, వ్యవసాయ రంగం ద్వారా జిల్లాకు కేవలం రూ.13,343 కోట్ల (41.2శాతం) ఆదాయం మాత్రమే వస్తోంది. ఈ ప్రభావం రైతులతోపాటు వ్యవసాయ రంగంపై ఆధారపడిన కార్మికులు, వృత్తిదారులపైనా పడింది. మత్స్యకారులు, వడ్రంగి, చేనేత వంటివృత్తుల నుంచి నేటితరం దూరమౌతోంది. సుమారు 30ఏళ్లలో వచ్చిన మార్పులే ఇందుకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు. జిల్లాలో జ్యూట్ మిల్లులు దాదాపు మూతపడ్డాయి. ఒకప్పుడు 20మిల్లులు ఉన్న ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం నాలుగైదుకు మంచి తిరగడం లేదు. ఫెర్రో ఎల్లాయిస్ కంపెనీలకు చెంతనే ముడిసరుకు ఉన్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాల సహకారం కొరవడడంతో ఇప్పటికే ఉన్న పరిశ్రమలు ఉనికి కోల్పోవాల్సి వస్తోంది. పూసపాటిరేగ ప్రాంతంలో అరకొర పరిశ్రమలు మినహా ఇంకేమీ చెప్పుకోదగ్గ పరిశ్రమలేవీ లేవు. ఉన్న కొద్దిపాటి పరిశ్రమల మూత వల్ల వేలాది మంది ఉపాధి కోల్పోవడంతో ఆయా కుటుంబాల వారి ఆర్థిక స్థితిగతులు దెబ్బతిన్నాయి. జిల్లాకు వస్తున్న వార్షిక ఆదాయంలో పారిశ్రామిక రంగం ద్వారా వస్తున్న ఆదాయం ఏటా తగ్గిపోవడం ఇందుకు నిదర్శనం. ఈ నేపథ్యంలో ప్రస్తుత ఎన్నికల్లో ఆచూతూచీ ఓట్లేసుకోవాల్సిన అవసరముందనే చర్చ జనాల్లో ముమ్మరంగా సాగుతోంది.

పింఛనులేవీ మంత్రి గారూ?

ప్రజాశక్తి - సాలూరు

ఒకటో తేదీ వచ్చింది... పింఛన్లు ఏవీ మంత్రి గారూ అని వృద్ధ మహిళలు డిప్యూటీ సిఎం రాజన్నదొరను ప్రశ్నించారు. పట్టణంలోని 12వ వార్డు కర్రివీధి, గాడి వీధుల్లో శనివారం ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కర్రివీధిలో చింత పిక్క తీత కార్మికులైన వృద్ధ మహిళల వద్దకు రాజన్నదొర వెళ్లారు. రానున్న ఎన్నికల్లో వైసిపిని మళ్లీ గెలిపించాలని, తనకు మరో అవకాశం ఇవ్వాలని కోరారు. ప్రతి నెలా ఒకటో తేదీకి పింఛన్లు పంపిణీ చేసేవారని, ఇప్పుడెందుకు ఇవ్వలేదని వృద్ధమహిళలు ప్రశ్నించారు. దీనిపై రాజన్నదొర మాట్లాడుతూ నెలనెలా ఒకటో తేదీకి పింఛన్లు అందిస్తున్న వాలంటీర్లపై చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ ఫిర్యాదు చేశారని, అందుకే ఎన్నికల సంఘం వాలంటీర్లను విధుల నుంచి తప్పించిందని చెప్పారు. వృద్ధులు, వికలాంగులు ఇబ్బందులకు గురి కావడానికి కారణం టిడిపి, జనసేన పార్టీలేనని చెప్పారు. ఎన్నికల కోడ్ ముగిసే వరకు అంటే మూడు నెలల పాటు పింఛను దారులకు ఇబ్బందులు తప్పవని చెప్పారు. ప్రజలకు సేవ చేస్తున్న వాలంటీర్లపై టిడిపి, జనసేన పార్టీలు మొదటి నుంచి కక్షపూరితంగా వ్యవహరిస్తున్నాయని చెప్పారు. ఈ పార్టీ నాయకుల తీరుపై ప్రజలు ఆలోచించుకోవాలని కోరారు. టిడిపి కూటమి అధికారంలోకి వస్తే ఇప్పుడు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదలకు అందవని రాజన్నదొర చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ, వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి జర్జాపు సూరిబాబు, జెసిఎస్ కన్వీనర్ గిరిరఘు, అర్బన్ బ్యాంక్ అధ్యక్షులు జర్జాపు ఈశ్వరరావు, కౌన్సిలర్లు రాపాక మాధవరావు పప్పల లక్ష్మణరావు గొర్లి వెంకటరమణ, వైసిపి నాయకులు ముసిడిపిల్లి కృష్ణ, జాగారపు రమేష్, పతివాడ శివ, యర్రా దాలినాయుడు, కొల్లి వెంకటరమణ, లింగాల సింహాచలం పాల్గొన్నారు.



పింఛన్లపై రాజన్నదొరతో మాట్లాడుతున్న వృద్ధులు

తాగునీటి సమస్య లేకుండా చర్యలు

ప్రజాశక్తి - కొమరాడ

వేసవి నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి సమస్యలు లేకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపడుతున్నట్లు ఎంపిడిఒ మల్లికార్జునరావు తెలిపారు. మండలంలో గతవారం రోజులుగా చేపడుతున్న క్రాష్ ప్రోగ్రామ్ ముమ్మరంగా కొనసాగు తుందన్నారు. సోమవారం అర్థం గ్రామంలో క్లాస్ ప్రోగ్రాం నిర్వహించినట్లు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో క్రాస్ ప్రోగ్రాం ఏర్పాటు చేసి మంచినీటి బోర్లను మరమతులు చేస్తున్నామన్నారు. ప్రతి గ్రామంలో జరిగే ఈ ప్రోగ్రామ్‌ను ఆయా ప్రజా ప్రతినిధులు వినియోగించుకొని గ్రామాల్లో మరమ్మతులకు గురైన మంచినీటి బోర్లను రిపేరు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బోరు మెకానిక్‌లు తిరుపతిరావు ఉన్నారు.

చలివేంద్రిలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని చలివేంద్రిలో సోమవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి వివిధ రకాలైన రోగులకు వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎండలు అధికంగా ఉన్నందున ఎండ వేడిమిని తట్టుకునేందుకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది, పాల్గొన్నారు .

నిబ్రంకే టికెట్ ఇవ్వాలని పూజలు

ప్రజాశక్తి - వీరఘట్టం

పాలకొండ టికెట్టు జనసేన సమన్వయకర్త నిమ్మల నిబ్రంకు ఇవ్వాలని సోమవారం మండలం నడుకూరు శ్రీ సాయి మారుతి ధ్యాన మందిరంలో ఉత్తరాంధ్ర జనసేన నాయకులు, తూర్పు కాపు సంక్షేమ సంఘం నాయకులు బిపి నాయుడుతో పాటు కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనతో పాటు జనసేన నాయకులు ఎం పుండరికం, జనసేన జానీ, పవన్ సాయి, తదితరులు పాల్గొన్నారు.

గిజబలో శివాలయ ప్రతిష్ట

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని గిజబలో సోమవారం శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ట మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, రక్షాబం ధనం, పరిషత్తు పంచగవ్య ప్రాశన, దీక్షాధారణ, యాగశాల ప్రవేశము, అఖండ దీపారాధన, గ్రామప్రదక్షణ, జలాధి వాసం తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమం సందర్బంగా కోలాటం ప్రదర్శనతో ఊరేగింపుగా కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయం వరకు తరలివెళ్లారు. ముగింపు రోజైన బుధవారం ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

పెదభోగిలిలో ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి- సీతానగరం

మండలంలోని పెదభోగిలిలో సోమవారం ఎమ్మెల్యే జోగారావు ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. ఆయన మాట్లాడుతూ మధ్యవర్తులు, దళారులు లేని పాలన ప్రజలకు చేరువ కావాలంటే వైసిపిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు బొంగు చిట్టి రాజు, జెడ్‌పిటిసి మామిడి బాబ్జీ, నాయకులు బలగ శ్రీరాములు నాయుడు, వైస్ ఎంపిపి టి. సూర్యనారాయణ, సురగాల గౌరీ కిరణ్, సూర్యనారాయణ, ఎస్ రామారావు, రమేష్, సతీష్ కుమార్, కుర్మరావు, యు సురేష్, పోల సత్యన్నారాయణ, ఎన్ రామకృష్ణ, రత్నాకర్, తదితరులు పాల్గొన్నారు.

జీడిని జిసిసి ద్వారా కొనాలి

పార్వతీపురం: జీడి పంటకు మద్దతు ధర కల్పించి, జిసిసి ద్వారా కొనుగోలు చేసి, రైతాంగాన్ని ఆదుకోవాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి టి.జీవ డిమాండ్ చేశారు. జీడీ పంటకు మద్దతు ధర ఇచ్చి, జిసిసి ద్వారా కొనుగోలు చేసి, జీడిపంట రైతాంగాన్ని ఆదుకోవాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సూరయ్య కలిసి కలెక్టరేట్ ఎఒకు వినతిని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లాలో సుమారు 40 లక్ష ఎకరాల్లో జీడి పంట సాగులో ఉందన్నారు. గత మూడేళ్ల నుంచి ప్రకృతిలో వచ్చిన మార్పులు వల్ల జీడి దిగుబడి రాక రైతులు తీవ్రంగా చాలా నష్టపోయారన్నారు. ఇప్పటికైనా జిసిసి ద్వారా జీడీ కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. వినతిని అందజేసిన వారిలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు బిటి నాయుడు పాల్గొన్నారు

గ్రామాల్లో టిడిపి ప్రచారం

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని గుమ్మడి గూడ పంచాయతీలో గల గుమ్మడిగూడ, దండుసురా, షేకుపాడు బియ్యలవలస పంచాయతీ దురిబిలి, సూర్యానగరం గ్రామాలలో ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి టి. జగదీశ్వరి సోమవారం రాత్రి బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా టిడిపి సూపర్ సిక్స్ పథకాలపై ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ కొండయ్య, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాష్ట్ర తెలుగుయువత అధికార ప్రతినిధి కోలా రంజిత్ కుమార్, మాజీ సర్పంచులు పత్తి, మాసయ్య, నాయకులు రమేష్, బుజ్జి, బోటు గౌరీ, భాస్కర్ రావు, గవరయ్య తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఉపాధి కూలీలు, నాయకులు

బిజెపి ఎమ్‌పి అభ్యర్థి గీతకు నిరసన సెగ

ప్రజాశక్తి - కురుపాం

నకిలీ గిరిజన, ఆర్థిక నేరాలకు పాల్పడిన కొత్తపల్లి గీతకు బిజెపి అధిష్టానం ఎంపి టికెట్ ఎలా కేటాయించిందని ఆ పార్టీ సీనియర్ నాయకులు హిమరక నీలకంఠేశ్వరరావు ప్రశ్నించారు. మండలంలో నీలకంఠాపురం పంచాయతీ కేంద్రంలో గిరిజన యువత, గిరిజనులతో కలిసి కొత్తపల్లి గీత టిక్కెట్లు రద్దు చేసి అచ్చమైన గిరిజనులకు కేటాయించాలని ప్లేకార్డులతో నినాదాలతో సోమవారం నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గీత ఎస్టీ కాదని కోర్టు కూడా తీర్పు ఇచ్చిందని అంతేకాకుండా ఆర్థిక నేరస్థురాలుగా ముద్ర ఉన్న వ్యక్తికి బిజెపి టికెట్ ఇవ్వడం సమంజసం కాదని, వెంటనే అచ్చమైన గిరిజనులకు టికెట్ కేటాయించాలని, లేనిచో ఆమెను ఓడించడానికి గిరిజనులు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో గిరిజన యువత, గిరిజనులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

160 లీటర్ల సారా పట్టివేత

ప్రజాశక్తి- సీతంపేట

స్థానిక ఎస్ఐ ఎం. జగదీశ్ నాయుడు తన సిబ్బందితో రేగులగూడ గ్రామ పోలిమేరలో సోమవారం దాడులు చేసి 160 లీటర్ల నాటుసారా పెట్టుకున్నారు. సారా నిర్మూలనకు అందరూ కృషి చేయాలని, సారా రవాణా చేస్తే వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు.

11 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - భామిని

బత్తిలి చెక్ పోస్ట్ వద్ద ప్రైవేట్ బస్సులో తనిఖీలు నిర్వహిస్తుండగా సుమారు 11 కిలోల గంజాయి లభించిందని బత్తిలి ఎస్ఐ సిహెచ్ ప్రసాద్ తెలిపారు. కేరళకు చెందిన ఒక పురుషుడు, ఒక మహిళ ఈ గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్నట్లు తెలిపారు. ఇద్దరిని అదుపులోకి తీసుకున్నామని, పట్టుబడిన గంజాయి విలువ రూ.55వేలు ఉంటుందని చెప్పారు.

చెరువులో పడి యువకుడు మృతి

ప్రజాశక్తి - పాలకొండ

పట్టణంలోని వెంకటరాయ కోనేరులో సోమవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో స్నానానికి వెళ్లిన మింది ప్రభాస్(19) చెరువులో పడి మృతి చెందాడు. స్నానం చేస్తుండగా చెరువులో చివరి మెట్టు దగ్గర జారిపడి కొట్టుకుపోయాడు. దీంతో అగ్నిమాపక సిబ్బంది వచ్చి మృతదేహాన్ని వెలికితీశారు. పెయింటింగ్ వేస్తూ కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉండేవాడు.

పాడి పశువుల పట్ల జాగ్రత్తలు తప్పనిసరి

పశు వైద్యాధికారి సురేష్‌కుమార్



మాట్లాడుతున్న వైద్యులు సురేష్‌కుమార్

ప్రజాశక్తి - గరుగుబిల్లి

ప్రస్తుతం ఎండల తీవ్రత పెరిగిన నేపథ్యంలో రైతులు పాడి పశువులను ఎండ ఎక్కువగా ఉన్న సమయంలో కాకుండా ఉదయం 9 గంటల్లోపు, సాయంత్రం 5 గంటల తర్వాత వాతావరణం చల్లగా ఉన్నప్పుడు మాత్రమే బయట మేతకు వదలాలని మండల పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ఎస్ సురేష్ కుమార్ సూచించారు. మండలంలోని ఉల్లిభద్ర పశు సంవర్ధకశాఖ కార్యాలయంలో సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుత వేసవికాలంలో పాడి పశువుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. రోజులో మూడు, నాలుగు పర్యాయాలు చల్లని నీటితో పశువులను కడగాలని పేర్కొన్నారు. రేకులతో ఉన్న పశువుల షెడ్లపై గడ్డిని కప్పి, మధ్యాహ్నం ఎండ ఎక్కువగా ఉన్న సమయాల్లో నీటిని చల్లాలన్నారు. అలాగే వడగాడ్పుల ప్రభావం లేకుండా పశువుల శాలల చుట్టూ గోనెలతో పరదాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈపరదాలను కూడా మధ్యాహ్న సమయంలో నీటితో తడపాల్సి ఉందని సూచించారు. పశువులశాలల పైభాగంలో తెలుపురంగు పెయింట్ వేయాలన్నారు. పశువులను కిక్కిరిసినట్లు కట్టకుండా దూరం, దూరంగా కట్టాలని చెప్పారు. ముఖ్యంగా నాటు జాతి పశువుల కంటే సంకర జాతి ఆవులు, గేదెలు త్వరగా వడదెబ్బకు గురవుతాయని వాటిని తరుచూ చల్లని నీటితో తడుపుతూ ఉండాలన్నారు. ఒక పశువు రోజుకు 60 లీటర్ల నీరు తాగుతుందని, అలాగే ప్రస్తుత వేసవిలో అపరిమాణం మరింత పెరుగుతుందని, ఈమేరకు రైతులు ఈ విషయాన్ని గమనించాలని తెలిపారు. అలాగే పశువులకు తాగునీరు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచాలన్నారు. తగినంత పచ్చిమేత వేయడంతో పాటు అత్యధిక పోషక విలువలు కలిగిన దాణాను అందించాలని వివరించారు. వేసిన దాణాలో మినరల్ మిక్చర్ కలిపిపెట్టడం మంచిదని సూచించారు. అంతేకాక దాణాలో తగినంత ఉప్పుశాతం ఉండేలా చూసుకోవాలన్నారు. ఉదయం, సాయంత్రం పాలు తీసే అరగంట ముందు పశువులను చల్లని నీటితో కడిగితే పాల దిగుబడి పెరిగే అవకాశం ఉందని తెలిపారు. అలాగే గొర్రెలు, మేకలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను కూడా వివరించారు. ప్రస్తుత వేసవిలో గొర్రెలు, మేకల పెంపకం చేపడుతున్న వారు వాటి సంరక్షణ కోసం పలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బయట పచ్చిక బయిళ్లలో ఉదయం, సాయంత్రం చల్లగా ఉన్నప్పుడు మేపుతూ.... మధ్యాహ్నం నీడలో విశ్రాంతి కల్పించాలన్నారు. చూడితో ఉన్న వాటిని, రెండు నెలల్లోపు పిల్లలున్న తల్లులను ఇంటి వద్దే ఉంచి ఆహారం అందించాలని మూగజీవాలకు చల్లని, పరిశుభ్రమైన నీరు అందేలా చూడాలని అన్నారు. నాటు కోళ్లను పెంచేవారు నిరంతరం గాలి తగిలెలా షెడ్లను ఏర్పాటు చేసుకోవాల్సి ఉందన్నారు. కోళ్ల మీద ఎండ వేడిమి ప్రభావం పడకుండా షెడ్ల మీద తాటి పీచుతో కప్పి తడుపుతూ ఉండాలన్నారు. అలాగే కోళ్లకు బెల్లం నీరు తాగించాలని రోధకశక్తిని పెంచడానికి విటమిన్లు కలిగిన మిశ్రమాన్ని పెట్టాలని సూచించారు. వ్యాధులు వ్యాపించకుండా ఎప్పటికప్పుడు వ్యాక్సిన్లు వేయించి జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన వివరించారు.

వసతిగృహాలకు డైట్ బిల్లులు లేనట్లేనా?

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

రాష్ట్ర ప్రభుత్వం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు మౌలిక సదుపాయాలు, నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందిస్తున్నామని చెబుతున్నా వాస్తవంగా అవేవీ కానరావడం లేదని గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు పల్లా సురేష్ సోమవారం ఒక ప్రకటనలో అన్నారు. సంక్షేమ వసతి గృహాలకు ఐదు నుంచి ఏడు నెలలగా విద్యార్థుల భోజనాలు తాలూక బిల్లులు ప్రభుత్వం మంజూరు చేయలేదన్నారు. దీంతో వార్డెన్లు చేసేది లేక బయట నుంచి వేలకు వేలు అప్పులు తెచ్చి విద్యార్థులకు భోజనాలు పెడుతున్నారని, వసతి గృహాలు కొనసాగిస్తున్నారని తెలిపారు. ఒక వైపు సరైన పౌష్టికాహారం లేక వైద్యం అందక విద్యార్థులు అనారోగ్యంతో మరణిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యావసర సరకుల ధరలు రోజు రోజుకు పెరుగుతుండటంతో ప్రభుత్వం ఇచ్చిన మెనూకు చెల్లిస్తున్న డైట్ చార్జీలు ఎటూ చాలడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిత్యవసర ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచాలని, పెండింగ్ బిల్లులు వెంటనే వార్డెన్లకు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

వేసవి తాపానికి ఆయుర్వేద చిట్కాలు

ప్రజాశక్తి - సీతానగరం



రోగులకు సూచనలు చేస్తున్న వైద్యులు హేమాక్షి

వేసవిలో వడదెబ్బకు గురికాకుండా ఆయుర్వేదంతో మంచి ఉపశమనం కలుగుతుం దని బూర్జ ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ టి.హేమాక్షి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె ఆసుపత్రిలో విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుత వేసవి తరుణంలో బయట ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని, అందుకు అనుగుణంగా తగు జాగ్రత్తలు తీసుకోని యెడల వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉందని, శరీరం నీటి శాతాన్ని కోల్పోతుందని అన్నారు. వీటికి గురికాకుండా ఉండేందుకు ఆయుర్వేద ఔషధాలు ఇంటి వద్ద చేసుకోగలిగేఉపశమనాన్ని పొందవచ్చునని తెలిపారు.

- సబ్జాగింజలు నానబెట్టి, నిమ్మరసం కలిపి అందులో కొంచెం కండ శర్కర వేసి తాగాలి.
- మజ్జిగలో జీలకర్ర పొడి చిటికెడు, కొంచం బ్లాక్ ఉప్పు కలిపి తీసుకోవాలి.
- వట్టివేరు(ఉశీర)పొడిచేసి అందులో కొద్దిగా దనియాల పొడి కలిపి కషాయం కాచి, - కండశర్కర కలిపి తాగాలి.
- శతావరి (పిల్లి పీచర) వేర్ల పొడి పాలలో కలిపి తీసుకోవచ్చు.
- అతి మధురం అర చెంచా ఒక గ్లాసు నీటిలో కలిపి తాగాలి. మధు మేహం ఉన్నవారు బెల్లం కాని, తాటి బెల్లం కాని ఉపయోగించవచ్చు.
- ఉసిరిక పౌడర్‌లో గుంటగలగర ఆకు, పెరుగు కలిపి తలకి పట్టించి గంట తర్వాత స్నానం చేయాలి.
- దోసకాయ రసం ముఖం, చర్మంపై పూతగా వేసుకున్న ఎండకి పొడి బారకుండా ఉంటుంది.

ఆహారం విషయానికి వస్తే ఈ వేసవిలో ఎక్కువగా శాఖాహారం తీసుకోవాలని సూచించారు. తాజా ఆకుకూరలు, కీర దోస, పుచ్చకాయ వంటి నీటి శాతం అధికంగా ఉండే వాటిని తీసుకోవాలన్నారు. వేపుడు పదార్థాలు, నూనె వంటలు బాగా తగ్గించుకోవాలి. పిల్లలను బయట ఫాస్ట్ ఫుడ్స్,చిరు తినుబండారాలకు సాధ్యమై నంత దూరంగా ఉంచాలని హితవు పలికారు. కాటన్, లేత రంగు, తేలిక పాటి దుస్తులు ధరించా లన్నారు. ఆసుపత్రిలో ఆయుర్వేద ఔషధాలు చందనాసవ, ఉశీరాసవ, ధాన్య పంచక కషా యం, షడంగ పానీయం మొదలగునవి వేసవి తాపానికి ఉపశమనం కలిగిస్తాయని అన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటూ వైద్యుల సూచ నలు పాటిస్తూ ఎండ తీవ్రతకు గురికా కుండా జాగ్రత్తలు పాటించాలని ఆమె కోరారు.

మెసేజ్‌కు స్పందించండి : తహశీల్దార్

ప్రజాశక్తి - వీరఘట్టం

అంతర్జాలంలో వచ్చే మెసేజ్‌లకు తక్షణమే స్పందించినప్పుడే మనం విధుల్లో ఉన్నట్లు అవుతుందని తహశీల్దార్ కె.జయప్రకాష్ బిఎల్‌ఒలను ఆదేశించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బిఎల్‌ఒలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుతం ఎన్నికల సీజన్లో మనం ఉన్నందున పైనుంచి ఉన్నత స్థాయి అధికారులు నుంచి వచ్చే మెసేజ్‌లకు తక్షణమే వాటికి వివరణ ఇవ్వాలన్నారు. గ్రామాల్లో ఎక్కడైనా వివిధ రాజకీయ పార్టీలకు చెందిన స్టిక్కర్లు జెండాలు వంటివి ఉంటే తక్షణమే తొలగించాలన్నారు. మీకు కేటాయించిన గ్రామాలు తరచుగా సందర్శించి గ్రామాల్లోని స్థితిగతులను తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో పోలింగ్‌కు సంబంధించిన వివరాలు అందులో పొందుపర్చడం జరుగుతోందని, వీటిని క్షుణ్ణంగా పరిశీలించి ఎక్కడైనా తప్పులు దొరినట్లయితే వాటిని సరి చేయాల్సిన బాధ్యత తీసుకోవాలన్నారు. అందరూ యూనిఫాంగా ఉండడంతో పాటు అందుబాటులో కూడా ఉండాలన్నారు. సమావేశంలో ఎంపిడిఒ ఎంవిబి సుబ్రహ్మణ్యం, ఉప తహశీల్దార్ సిహెచ్ సత్యనారాయణ, ఆర్ఐ లక్ష్మంనాయుడు, పలువురు బిఎల్‌ఒలు పాల్గొన్నారు.

బూత్ స్థాయి అధికారులకు శిక్షణ

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో సోమవారం మండలానికి చెందిన 67 మంది బూత్‌స్థాయి అధికారులకు ఎన్నికలకు సంబంధించిన శిక్షణ నిర్వహించారు. తహశీల్దార్ కె.ఆనందరావు ఆధ్వర్యంలో జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఎన్నికలపై వారికి ఉన్న సందేహాలను నివృత్తి చేశారు.

ఉపాధి బిల్లులు చెల్లించాలని నిరసన

ప్రజాశక్తి- పాచిపెంట



నిరసన తెలుపుతున్న ఉపాధి కూలీలు, నాయకులు

ఉపాధి హామీ బిల్లులు వెంటనే చెల్లాంచాలని కోరుతూ మండలంలోని గరిల్లవలస గ్రామం వద్ద వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు సుర్రు రామారావు ఆధ్వర్యంలో సోమవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ ఐదు వారాలుగా పనిచేసిన ఉపాధి కూలీలకు రెండు నెలల దాటిన నేటికీ బిల్లులు చెల్లించలేదన్నారు. పనిచేసిన 14 రోజులకే బిల్లులు చెల్లించాలని చట్టంలో ఉన్న చట్టాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉల్లంఘిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తక్షణమే ఉపాధి బిల్లులు చెల్లించి గిట్టుబాటు కూలి చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని, వెంటనే పనులు ప్రారంభించాలని పని దినాలు పెంచాలని, 2 వందల రోజులు పనులు ఇచ్చి కేరళ రాష్ట్రం తరహాలో 600 రూపాయలు రోజుకూలి చెల్లించాలని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ ఎర్రజెండా నాయకత్వంలో సాధించుకున్న ఉపాధి చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం నిర్వీర్యం చేసే కుట్రలు చేస్తున్నాయని ఉపాధి హామీని సక్రమంగా అమలు చేసిన రాష్ట్రం కేరళ అని కేరళ తరహాలో ఉపాధిని ముందుకు నడిపించే విధంగా చర్యలు చేపట్టాలని పనిచేసిన చోట మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ చట్టాన్ని సక్రమంగా అమలు చేయడంతో పాటు అవినీతికి తావు లేకుండా జిల్లా యంత్రాంగం పకడ్బందీగా వ్యవహరించాలన్నారు. ఎంతో ప్రాధాన్యత కలిగిన ఉపాధి చట్టం వల్ల వలసలు తగ్గాయని ఇటువంటి పరిస్థితుల్లో కూలి డబ్బులు సక్రమంగా చెల్లించకపోతే మరల వలసలు పెరిగిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. జిల్లావ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉందని ఇప్పటికైనా ఉపాధి హామీ బిల్లులు వెంటనే చెల్లించి పని దినాలు పెంచాలని పనులు వెంటనే ప్రారంభించాలని, పారలు, గుణపాలు పంపిణీ చేయాలని కోరారు.

సిఎంపై కేసు నమోదు చేయాలి

ప్రజాశక్తి - కురుపాం

ఎపిపిఎస్‌సిలో జరిగిన కుంభకోణంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, గౌతమ్ సవాంగ్‌పై కేసు నమోదు చేయాలని తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి కోలా రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో మండల టిడిపి కన్వీనర్ కెవి కొండయ్య ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ గ్రూప్ 1,2 పరీక్షల్లో అక్రమాలకు, అధికార దుర్వినియోగానికి పాల్పడ్డ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, ఎపిపిఎస్‌సి చైర్మన్ గౌతం సవాంగ్‌పై చర్యలు తీసుకొని వారిపై కఠిన సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి నిరుద్యోగులకు న్యాయం చేయాలని అన్నారు. కార్యక్రమంలో టిఎన్‌ఎస్‌ఎఫ్ మీడియా కోఆర్డినేటర్ సుకేష్ చంద్ర పండా, తెలుగు యువత నాయకులు మీసాల ప్రశాంత్, రాజేష్, విజయ్, గవరయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న డిఇఒ పగడాలమ్మ

విద్యార్థులకు డిఇఒ అభినందనలు

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

ఉమ్మడి విజయనగరం జిల్లాల్లో 2023-24 విద్యా సంవత్సరానికి జవహర్ నవోదయ ప్రవేశ పరీక్షల్లో అత్యధిక 12 సీట్లు సాధించిన పెదమేరంగి కూడలిలో గల తిరుమల సాయి హైస్కూల్ విద్యార్థులను జిల్లా విద్యాశాఖాధికారి జి.పగడాలమ్మ సోమవారం స్వీట్లు పంచి అభినందించారు. ప్రతి ఏటా తిరుమలసాయి పాఠశాల యాజమాన్యం, సిబ్బంది ఉచితంగా నవోదయ ప్రవేశ పరీక్ష నిర్వహించి ఇలా పదుల సంఖ్యలో విద్యార్థులను నవోదయ ఎంపిక కావడం అభినందనీయమన్నారు. ఈ ఏడాది ఎం.కుషాలినీ, డి.జోషిత, వై.ప్రవళిక, డి.తనుశ్విని, పి.ప్రణిత్, పి.రిషి, జె.ప్రణయ్‌సాయి, జె.గౌతం, పి.లోహిత్, బి.అఖిల్, పి.శ్రీధర్, జి.కె.ఈశ్వర్ ఎంపిక కావడం ఆనందంగా ఉందని పాఠశాల అకాడమిక్ అడ్వైజర్ రౌతు వెంకటరమణ, ప్రధానోపాధ్యాయుడు ఉమామహేశ్వరరావు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు టీచర్లు పాల్గొన్నారు.

ఇబ్బంది లేకుండా పింఛన్లు ఇవ్వాలి : సిపిఎం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్



పార్వతీపురం టౌన్: కమిషనర్‌కు వినతినిస్తున్న నాయకులు

వృద్ధాప్య, వితంతు, వికలాంగు, ఒంటరి మహిళ, చేనేత కార్మిక, మత్స్యకార, లింగమార్పిడి, డప్పు కళాకారుల పింఛన్లు ఇబ్బంది లేకుండా, రాజకీయ పార్టీల ప్రయోజనం లేకుండా ఇవ్వాలని పట్టణ సిపిఎం కార్యదర్శి గొర్లి వెంకటరమణ, నాయకులు పాకల సన్యాసిరావు, బంకురు సూరిబాబు మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాస్‌ను కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్‌ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వృద్ధులకు, వికలాంగులకు, వ్యాధిగ్రస్తులై మంచంపై ఉన్న వారికి ఏ ఇబ్బంది లేకుండా పింఛన్లు ఇవ్వాలన్నారు. ఎన్నికల నిబంధనలో భాగంగా ఆందోళన చెందుతున్న పింఛనుదారులకు భరోసా కల్పించేలా చర్యలు చేపట్టాలని కమిషనర్‌ను కోరారు. దీనికి కమిషనర్ స్పందిస్తూ ప్రభుత్వ మార్గదర్శకాలననుసరించి పింఛనుదారులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

నిధులు లేకనే పింఛన్లపై వైసిపి దుష్ప్రచారం : టిడిపి

గుమ్మలక్ష్మీపురం: సచివాలయ సిబ్బంది, గ్రామ కార్యదర్శులతో పింఛన్లు పంపిణీ చేయించకపోవడానికి నిధులు కొరతే కారణమని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి తోయక జగదీశ్వరి అన్నారు. సోమవారం సాయంత్రం ఆమె ఒక ప్రకటనలో మాట్లాడుతూ ఖజానాలో నిధులు లేక వైసిపి టిడిపి పింఛన్లు ఆపేసిందని దుష్ప్రచారం చేస్తోందన్నారు. పింఛన్ల పంపకానికి చంద్రబాబుకు, ఎన్నికల కమిషన్‌కు సంబంధం లేదన్నారు. కేవలం నిధులు లేకనే పింఛన్లు ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. 1.35 లక్షల మంది సచివాలయ సిబ్బంది ద్వారా యుద్ధ ప్రాతిపదికన పింఛన్లు ఇంటింటికీ పంపిణీ చేయవచ్చునన్నారు.

ఇంటికి వెళ్లి పింఛను అందించాలి

కొమరాడ: సామాజిక పింఛన్లు విషయంలో రాజకీయాలు పక్కన పెట్టి అందరికీ సచివాలయం సిబ్బంది ద్వారా ఇంటికి వెళ్లి పింఛన్ ఇచ్చే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి సోమవారం డిమాండ్ చేశారు. అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపిలు ఒకరిపై ఒకరు నిందులు వేసుకుంటూ పింఛనర్లకు సకాలంలో పింఛన్లు అందించడం లేదన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీన పింఛను అందుకునే వృద్ధులు, వికలాంగులు ఈ నెలా ఒకటో తేదీన పింఛను అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. వివిధ శాఖల సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వాలంటీర్ల ఫోన్లు, బయోమెట్రిక్ యంత్రాలు స్వాధీనం

ప్రజాశక్తి - కొమరాడ



కొమరాడ: సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుంటున్న అధికారి

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు వాలంటీర్ల దగ్గర ఉన్న సెల్ ఫోన్లు, బయోమెట్రిక్ యంత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎంపిడిఒ మల్లికార్జున తెలిపారు. గతంలో వాలంటీర్ ద్వారా పెన్షన్లు, వివిధ పథకాలు అందజేశావారమని ఎన్నికల కోడ్ నేపథ్యంలో వాలంటీర్లను ప్రభుత్వ పథకాలు పంపిణీకి వినియోగించుకోవద్దని ఎన్నికల కమిషన్ ఆదేశాలు ఇవ్వడంతో వాలంటీర్ల వద్ద ఉన్న సెల్ ఫోన్లు, బయోమెట్రిక్ యంత్రాలను స్వాధీనం చేసుకుంటున్నామన్నారు. మూడో తేదీ నుంచి మండలంలో పింఛన్లు పంపిణీ చేపడతామన్నారు. సచివాలయ ఉద్యోగి, పంచాయతీ కార్యదర్శులు ఆయా గ్రామాల పరిధిలోగల పింఛన్లు పంపిణీ చేస్తారన్నారు.

వీరఘట్టం : మండలంలోని 24వ సచివాలయం పరిధిలో 290 మంది గ్రామ వాలంటరీ నుంచి సోమవారం అధికారులు మొబైలు సిమ్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు వారి వద్ద నుంచి పరికరాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎంపిడిఒ ఎంవిబి సుబ్రహ్మణ్యం తెలిపారు. 290 మంది గ్రామ వాలంటీర్లకు గానూ 260 మంది వాలంటరీ నుండి మొబైళ్లు, సిమ్‌లు అందజేసినట్లు ఆయన తెలిపారు.

ఎన్నికల విధులు మార్చాలని వినతి

ప్రజాశక్తి - వీరఘట్టం



డిఆర్‌ఒ కేశవరావుకు వినతినిస్తున్న జెఎసి నాయకులు

ఉపాధ్యాయుల ఎన్నికల విధులు మార్చాలని కోరుతూ సోమవారం పార్వతిపురం మన్యం జిల్లా రెవెన్యూ అధికారి జి కేశవ నాయుడుకు వీరఘట్టం మండల జెఎసి ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యాయ క్యాడర్ ప్రాతిపదికన ఎన్నికల విధులను కేటాయిం చాలని, సెకండరీ గ్రేడ్ టీచర్, స్కూల్ అసిస్టెంట్లు మహిళ ఉపాధ్యాయులను ఎపిఒ, ఒపిఒగా నియమించాలని, 55 సంవత్సరాలు నిండిన మహిళ ఉపాధ్యాయులను అన్ని క్యాడర్‌లో ఎపిఒ, ఒపిఒగా నియమించాలని కోరారు. పదవీ విరమణ చేయబోవు ఉపాధ్యాయులకు మార్చి నెల నోటిఫికేషన్ తేదీ నుండి ఆరు నెలల లోపు సర్వీసును పరిగణలోనికి తీసుకోవాలని తదితర అంశాలపై వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యాయ జెఎసి నాయకులు ఎం పైడిరాజు, ఏ సూర్యనారాయణ, ఏ వెంకటరావు, కె.గోవిందరావు, మురళి, కేశవరావు, కెటివి పోలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

సి-విజిల్ ఫిర్యాదులు పరిష్కరిస్తాం

ప్రజాశక్తి - సీతానగరం



మాట్లాడుతున్న ఎంపిడిఒ ఈశ్వరరావు

సి-విజిల్ యాప్ ద్వారా వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి ప రిష్కరిస్తామని ఎంపిడిఒ ఎం. ఈశ్వరరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పిఒలు, బిఎల్‌ఒలతో ఆయన సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నియమావళి నిబంధనలను అమలయ్యేలా చూడాలన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలోనూ వచ్చిన సమస్యలు కోసం వెంటనే స్పై ఇన్ స్క్వాడ్ వెళ్లి పరిశీలిస్తుందన్నారు. పింఛన్లు సచివాలయం ద్వారా అందజేయాలని, పంచాయతీ కార్యదర్శి సచివాలయ సిబ్బందిని అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో తహశీల్దార్ ఎ.శ్రీనివాసరావు, ఎఒ అవినాష్, జి. సూర్య దేముడు, ఎం వెంకటరమణతో పాటు మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, బిఎల్‌ఒలు పాల్గొన్నారు.

సీతంపేటలో చలివేంద్రం

ప్రజాశక్తి- సీతంపేట

సీతంపేట గ్రామ పంచాయతీ పరిధిలోని శివాలయం వద్ద ఇఒపిఆర్‌డి కొండపల్లి సత్యం చేతుల మీదుగా సోమవారం చలివేంద్రం ప్రారంభించారు. వేసవికాలం దృష్ట్యా ప్రయాణికులకు, పిల్లలకు వృద్ధులకు ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. దీనిని వినియోగిం చుకోవాలని దాహన్ని తీర్చుకోవాలని సూచించారు. వృద్ధులకు ఒఆర్‌ఎస్ కలిపిన నీటిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి సుదర్శన్‌రావు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం అధ్వానం

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక నగర పంచాయతీలో పారిశుధ్యం పరమ అధ్వాన్నంగా ఉంది. కోట్లాది రూపాయలు పన్నులు వసూళ్లు చేస్తున్న నగర పంచాయతీ అధికారులు పట్టణంలోని సమస్యలను, పారిశుధ్య నిర్వహణను కనీసం పట్టించుకోవడంలేదు. దీంతో పట్టణంలోని రోడ్లుపైన చెత్తాచెదారం, మురినీరు ప్రవహిస్తోంది. ఎక్కడికక్కడ పెంట కుప్పలు దర్శనమిస్తున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాజాగా సోమవారం వెంకంపేట జంక్షన్ దగ్గర కాలువల్లో పూడికలు తొలగించకపోవడంతో మురికి నీరు రోడ్లపైన ప్రవహిస్తోంది. మురికినీరు రోడ్లపై ప్రవహించడం, దుర్వాసనతో స్థాని కులు ఇబ్బంది పడుతున్నారు. దీంతో నగర పంచాయతీ అధికారులపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, సమస్య పరి ష్కారం కోరుతూ వినతులు అందజేశారు.



రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీరు